క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రాల తనిఖీ



వ్యాధి నిరోధక టీకాలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్ఓ కొండయ్య

సంబేపల్లి : మండల పరిధిలోని నారాయణరెడ్డి పల్లె హెల్త్ క్లినిక్, దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి కొండయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నారాయణరెడ్డిపల్లిలో తనిఖీ చేసి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై ఆరాతీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.

అసౌకర్యంగా ఏటీఎంలు

పీలేరు : ప్రజలకు ఎనీ టైం మనీ అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఏటీఎంలు వినియోగదారులకు తీవ్ర అసౌకర్యంగా ఉండడంతో పాటు ఎలాంటి భద్రత లేదు. పీలేరు పట్టణంలో వివిధ బ్యాంకులకు సంబంధించి సుమారు పదిహేను ఏటీఎంలు ఉన్నాయి. మెయింట్‌నెన్స్ లోపంతో ఏ ఏటీఎం చూసినా బూజు పట్టి, చెత్తాచెదారం పేరుకుపోయి అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నారు. ఎక్కడా ఏసీలు పని చేయక అలంకార ప్రాయంగా ఉన్నాయి. మరోవైపు ఏటీఎం వల్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా పని చేయడం లేదు. కొన్ని ఏటీఎంలకు డోర్లు పగిలిపోయి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎం నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

పెద్దతిప్పసముద్రం : స్థానిక మోడల్ స్కూల్‌లో 8వ తరగతి పూర్తి చేసిన ఇందుకూరి ధీరజ్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఎంఈఓ నారాయణ, ప్రిన్సిపాల్ శివకుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జోగివారిపల్లికి చెందిన విద్యార్థి ఇటీవల నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష రాయగా 89 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రభుత్వం ద్వారా ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతం మంజూరవుతుందని తెలిపారు.

జాతీయ ఉపకార వేతనాలకు ముగ్గురు ఎంపిక

పీలేరు రూరల్ : జాతీయ ఉపకార వేతనాలకు స్థానిక మెయిన్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన పి.ముస్కాన్, పి.జుబేర్‌ఖాన్, ఎస్.తహసీన్ ఎంపికైనట్లు తెలిపారు. ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ. 48 వేలు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫ్యారూఖాన్, ఎం. శ్రీరాములు, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ : మాస శివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి కి రుద్రాభిషేకం చేశారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇది మల్లెల.. మాసం



విక్రయానికి సిద్ధంగా ఉన్న మల్లెపూలు

పులివెందుల రూరల్ : మగువల మనసు దోచుకునే మల్లెలు ప్రస్తుతం మార్కెట్లో గుమాలిస్తున్నాయి. పులివెందుల పట్టణంలో పూలఅంగళ్ల దుకాణాల వద్ద దండలు కట్టి రాసులుగా పోసి విక్రయిస్తున్నారు. తోపుడుబండ్లపై ప్రధాన రహదారుల్లో మల్లెలు కనువిందు చేస్తున్నాయి. కదిరి, అనంతపురం, తదితర ప్రాంతాల నుంచి పులివెందుల ప్రాంతానికి మల్లెలు తెచ్చి వ్యాపారులు విక్రయిస్తున్నారు. పూలజడలకు, దండలకు డిమాండ్ పెరిగింది. కిలో మల్లె పూలు నాణ్యతను బట్టి రూ.100ల నుంచి రూ.150ల వరకు విక్రయిస్తున్నారు. తోపుడుబండ్లపై పావు పూలు రూ.10కి ఇస్తుండటంతో మహిళలు వాటిని కొనకుండా ఉండలేకపోతున్నారు.

ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవలోనే..



గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

రాయచోటి : ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా రాయచోటి అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనను విలేకరులకు విడుదల చేశారు. 15 సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలు తనను చాలా గొప్పగా ఆదరించారన్నారు. ఐదేళ్లు మాత్రమే అధికారంలో ఉన్నామని, అందులో రెండేళ్లు కరోనా పరిస్థితులు వచ్చాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి ఇంటినీ సందర్శించానన్నారు. కరోనా పరిస్థితుల్లోనూ ప్రజలకు తోడుగా ఉన్నానన్నారు. మూడేళ్లలో తమ ద్వారా చేయగల్గిన అభివృద్ధి చేశామన్నారు. ఐదు సంవత్సరాలు ప్రజల మధ్యలోనే ఉన్నానని పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో ప్రజలు దాదాపుగా 90 వేలకుపైగా ఓట్లు వేసి ఆదరించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. స్వల్ప ఓట్లతో ఓటమి చెందానన్నారు. హంగూ ఆర్భాటాలకు ప్రాధాన్యత లేకుండా ప్రతి నిమిషం ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి, శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ప్రజలకు సేవా కార్యక్రమాలు కానీ, ప్రజలకు ఇష్టం వచ్చిన సమయాలలో తోడుగా నిలుస్తానన్నారు. కొంతమంది అభిమానులు నిరుత్సాహపడి బాధపడుతున్న విషయాన్ని తాను అర్థం చేసుకోగలనన్నారు. కానీ మనోధైర్యాన్ని కూడకట్టుకొని మనలను నమ్ముకున్న వారికి తోడుగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పును గౌరవించాలన్నారు. విజయం సాధించిన వారికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు బుధవారం విజయవాడకు వెళ్తున్నానని, వచ్చిన తరువాత నియోజకవర్గ ప్రజలను, నాయకులను, కార్యకర్తలను కలుస్తానన్నారు. స్వతహాగా తాను వ్యాపారవేత్తను కాదని, కాంట్రాక్టర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వాడిని అంతకన్నా కాదన్నారు. తనకు తెలిసిందంతా ప్రజా సేవే అన్నారు. తుది శ్వాస వరకు ప్రజాసేవ చేస్తానని, నమ్ముకున్న పార్టీ శ్రేణులకు ప్రతి అడుగులో తోడుంటానన్నారు. గత పదిహేనళ్లలో ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించినప్పుడు పొంగిపోలేదు, ఇప్పుడు స్వల్ప మెజారీతో ఓడినా కృంగిపోనన్నారు. ప్రజల కోసం రాత్రింబవళ్లు పనిచేసే ఆరోగ్యాన్ని, అన్ని కష్టాలను భరించే శక్తిని దేవుడు నాకు ఇచ్చాడన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఆకేపాటి అమరనాథరెడ్డికి శుభాకాంక్షలు



నందలూరు: ఆకేపాటిని సత్కరిస్తున్న ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

నందలూరు : రాజంపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆకేపాటి అమరనాథరెడ్డికి బుధవారం ఆకేపాటి ఎస్టేట్‌లో రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, నందలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆకేపాటికి శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ గాలివీటి

వీరబల్లి : రాష్ట్ర సార్వత్రిక ఎన్నికలలో రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన ఆకేపాటి అమరనాథరెడ్డిని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, ఆయతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిణామలపై చర్చించారు.

శిశు సంరక్షణ తల్లి బాధ్యత

కలకడ : చంటిబిడ్డ అనారోగ్యాలను మొదటి గుర్తించేది తల్లే అని, ఆ నైపుణ్యం ఎంతో అవసరమని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కదిరాయచెర్వు పంచాయతీలో 104 వాహనం ద్వారా ఉచిత వైద్య సేవలను అందించారు. వర్షాకాలం కారణంగా జలుబు, దగ్గు, జ్వరం, నీరసం, శ్వాసకోశ వ్యాధులకు, శరీరంపై గుల్లలు రావడం వంటివి జరుగుతాయన్నారు. తల్లి బిడ్డను ప్రసవించిన అరగంటలోపు బిడ్డకు అందించే ముర్రుపాలలో అధిక వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, ఆరు మాసాలపాటు విధిగా బిడ్డకు తల్లిపాలు అందించాలని కోరారు. ఆహారం తీసుకునే ముందు చేతుల పరిశుభ్రత ముఖ్యమని చేసి చూపించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్న ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెరుగుతున్న టమాటా ధరలు



మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ : టమాటా ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ధరలు పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె మార్కెట్‌కు గత రెండు నెలలు నుంచి టమాటాలు వస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులు తక్కువ. ధరలు పుంజుకుంటున్న సమయంలో దిగబడులు తగ్గాయి. పెరుగుతున్న ధరలు చూసి రైతులు టమాటా సాగుపై మొగ్గు చూపుతున్నారు. మదనపల్లె మార్కెట్‌లో మంగళవారం మొదటి రకం 10 కిలోలు రూ. 660 పలికింది. రెండో రకం 10 కిలోలు రూ.520 పలికింది. 349 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. గత వారం రోజుల నుంచి ధరలు చూస్తే ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ధరలు ఇంకా పెరుగుతాయని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.

వారం రోజులుగా టమాటా ధరల వివరాలు

తేదీ	మొదటి రకం (పది కిలోలు)	రెండో రకం
31.5.2024	రూ.360	రూ.278
1.6.2024	రూ.380	రూ.298
2.6.2024	రూ.440	రూ.320
3.6.2024	రూ. 500	రూ.390
4.6.2024	రూ.660	రూ.520

తొలిదశలో కేన్సర్‌ను గుర్తిస్తే జయించడం సులువు

మదనపల్లె : కేన్సర్ అనగానే అందరూ భయంతో వణికిపోతారు. ఈ వ్యాధి సోకితే ఇక తనువు చాలించాల్సిందే అని భయాందోళనకు గురవుతారు. అయితే ప్రస్తుతం కేన్సర్‌కు అధునాతనమైన వైద్యం, చికిత్స, మందులు అందుబాటులోకి వచ్చాయి. కేన్సర్ వ్యాధి భారినపడ్డ వారు ఎవరూ ఆందోళన చెందకుండా వైద్యం చేయించుకుంటే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక సర్వజన ఆసుపత్రుల్లో కేన్సర్‌కు వైద్యం అందుబాటులో ఉంది. ప్రాణాంతకమైన వ్యాధి అయినప్పటికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్యం, ఆత్మవిశ్వాసంతో కేన్సర్‌ను జయించవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. కేన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందంటున్నారు.

కేన్సర్‌ను గుర్తించడం ఎలా?

శరీరంలో అదుపులేకుండా పెరిగే కణజాలమే కేన్సర్. ప్రస్తుతం మనిషి జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగానే కేన్సర్ వ్యాప్తి తీవ్రమవుతుంది. పొగతాగడం, మద్యం సేవించడం, అధికబరువు, వయస్సు పెరుగుదల, వంశపారంపర్యంగా, కొన్ని వైరస్‌ల కారణంగా మనిషి కేన్సర్ వ్యాధి భారీ పడుతున్నారు.

లక్షణాలు ఇలా..

ఎలాంటి కారణం లేకుండా బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం, అధికరక్తస్రావం, శరీరంలో గడ్డలు, ఎక్కువ రోజులుగా మలబద్దకంగా ఉండటం, మూత్ర విసర్జన సమయంలో రక్తంపడటం అలాగే నోటిలో పుండ్లు వచ్చి వైద్యం చేయించుకున్నప్పటికి తగ్గకుంటే కేన్సర్ లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.

మూడు రకాల్లో వైద్యం :

కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయమవుతుంది. కీమో, రేడియో థెరఫి, శస్త్ర చికిత్సల ద్వారా వైద్యం చేస్తారు. కీమో థెరపీ అంటే. మందులు, సూదుల ద్వారా వైద్యం చేస్తారు. రేడియో థెరఫీ అంటే ప్రత్యేకమైన మిషన్ల ద్వారా క్యాన్సర్ సోకిన భాగానికి వైద్యం చేసి క్యాన్సర్‌ను నయం చేస్తారు. శస్త్ర చికిత్సతో కేన్సర్ సోకిన భాగాన్ని తొలగించి తద్వారా నయం చేయవచ్చు. .

కేన్సర్ సోకకుండా ఉండాలంటే..

సమతుల్య ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని నడక, వ్యాయామం. మద్యం, పొగతాగడం వంటివాటికి దూరంగా ఉండటం, కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా కేన్సర్ వ్యాధి ఉండివుంటే ఆ కుటుంబంలోని సభ్యులు డాక్టర్‌ను సంప్రదించి సలహా పొందితే కేన్సర్ వ్యాధి భారీన పడకుండా ఉండవచ్చు.

సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి...

యాభై సంవత్సరాలు పైబడ్డ మహిళలు రొమ్ము కేన్సర్‌కు సంబంధించిన టెస్ట్‌లను ఏడాదికి ఒకమారైనా చేయించుకోవాలి. 21 సంవత్సరాలు పైబడిన వారు మూడు సంవత్సరాలకు ఒకసారి గర్భాశ ముఖ ద్వారా పరీక్షలు చేయించుకోవాలి. నలభై సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలు పేగుకు సంబంధించిన పరీక్షలను చేయించుకోవాలి. ఇలా చేయడం వల్ల కేన్సర్ సోకి ఉంటే గుర్తించి వైద్యం పొందేందుకు వీలవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ

లక్కిరెడ్డిపల్లె : ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని లక్కిరెడ్డిపల్లె సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం లక్కిరెడ్డిపల్లి-1 అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితే ప్రకృతి సహకరించి వర్షాలు కురిసి కరువును నియంత్రించవచ్చన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లోను పెరటిలో కూరగాయల మొక్కలు నాటాలన్నారు. పెరట్లో పండించిన కూరగాయలతో పిల్లలకు మంచి పౌష్టికాహారం, ఆకుకూరలు అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం ప్రతి పిల్లవాడికి అందేటట్లు చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడటాన్ని నిషేధించాలన్నారు. జూట్ బ్యాగ్‌లను వాడాలని తెలియజేశారు. రాబోయే తరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దామని చెప్పారు. అనంతరం వారు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దాద్ బీ, లలిత, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

వాల్మీకిపురం : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామని పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఓట్లు వేసిన పీలేరు నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమ పథకాలు అందించామన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీలు కూడా అభివృద్ధిని కొనసాగించాలన్నారు. వేలకోట్ల రూపాయలు డీబీటీ ద్వారా అర్హత కల్గిన పేదలకు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అవ్వా, తాతలు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు ఇచ్చామని, రైతులకు భరోసా ఇస్తూ సంక్షేమం అందించామని, అమ్మ ఒడి, విద్యాదీవెన అందిస్తూ ముందడుగు వేసినా ఈ ఫలితాలు వస్తాయని ఊహించలేదన్నారు. నియోజకవర్గంలో ప్రతి నాయకుడు, కార్యకర్తలు తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు.

డిగ్రీ ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు

వేంపల్లె : 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ హెల్ప్ డెస్క్ ద్వారా డిగ్రీ ప్రవేశానికి ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ కళాశాల ఏర్పాటైన మూడేళ్ల సందర్భంగా ఐదు కోర్సులకు అదనంగా కొత్తగా బీఎస్సీ హానర్స్ బాటనీ కోర్సును అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వేంపల్లె పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే బీఏ హిస్టరీ, బికామ్ కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, మాథ్స్, కెమిస్ట్రీ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 మంది పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకుల బృందంతో బోధన జరుగుతుందన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, రెడ్ రిబ్బన్, క్యాంపస్ డ్రైవ్‌తో పాటు ఆధునిక పద్ధతుల్లో బోధన నిర్వహించబడుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కోర్టు అవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

సిద్దవటం : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దవటం కోర్టు బార్ ప్రెసిడెంటు బి.వెంకటరత్నం అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సిద్దవటం రేంజర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అవరణలో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బార్ ప్రెసిడెంటు వెంకటరత్నం మాట్లాడుతూ కాలుష్యాన్ని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. భావితరాల వారికి మంచి పర్యావరణాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓ పెంచల్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, అటవీ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాలలో విద్యార్థుల ప్రతిభ



ఓం సాయితరుణ్

రాయచోటి రూరల్ : రాయచోటి పట్టణంలోని బోసనగర్‌కు చెందిన కొసినేపల్లి రెడ్డయ్య, చంద్రకళ దంపతుల కుమారుడైన కె.యోగానంద మంగళవారం విడుదలైన నీట్ ఫలితాలలో 632 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 46 వేల ర్యాంకును సాధించారు. విజయవాడ నగరంలో ఓ ప్రైవేట్ కళాశాలలో శిక్షణ తీసుకుని మొదటి ప్రయత్నంలోనే ఫలితాన్ని సాధించినట్లు వివరించారు. మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకుని పేదలకు సేవ చేయడమే తన లక్ష్యమని తెలియజేశారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు, స్నేహితులు శుభాకాంక్షలు చెప్పారు.

సత్తా చాటిన సాయి తరుణ్

పట్టణంలోని పశుసంవర్ధక శాఖలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న లోకేష్ కుమారుడు వల్లంకొండు ఓం సాయితరుణ్ 695 మార్కులతో ఆలిండియాలో 3127 ర్యాంకు సాధించారు. అంతేకాకుండా ఈఏపెసెట్‌లో 23వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు, శుభాకాంక్షలు తెలియజేశారు.

హరిహర తనయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప

రాజంపేట రూరల్ : పట్టణ శివార్లలోని మణికంఠ నగర్‌లో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రతి బుధవారం, సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీ అయ్యప్పస్వామి మూల విరాట్‌కు ముందుగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి బుధవారం, సోమవారం భక్తులు తీసుకొచ్చిన పూజా సామగ్రితో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించనున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధికి చెక్



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీవిద్య

వాల్మీకిపురం : క్షయ వ్యాధి లేని సమాజ నిర్మాణ లక్ష్య సాధన కోసం వయోజన బీసీజీ టీకాలు ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. బుధవారం మండలంలోని విఠలం, బోయపల్లి గ్రామాల్లో ప్రజలకు బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వయోజన టీకా చాలా సురక్షితమైందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మదర్ రఫీ, సూపర్‌వైజర్లు సుధాకర్, సిబ్బంది రెడ్డెమ్మ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం మండల పోలింగ్ సరళి

సిద్దవటం: సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. సిద్దవటం మండలంలో ఆపార్టీకి మంచి మెజార్టీ లభించింది. మండలంలో గ్రామాల వారీగా వైఎస్సార్‌సీపీ సాధించిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

బూత్ నెంబర్	గ్రామం పేరు	వైఎస్ఆర్‌సీపీ	టిడిపి	మెజార్టీ
1.	లింగంపల్లె	183	306	123
2.	కడపాయపల్లె	418	339	79
3.	టక్కోలి	490	445	45
4.	టక్కోలి	496	264	232
5.	మాచుపల్లె	349	194	155
6.	మాచుపల్లె	288	265	23
7.	శాంతినగర్ మాచుపల్లె	359	267	92
8.	పొన్నపోలు	494	196	298
9.	పి.వెంకటయాపల్లె	307	132	175
10.	జ్యోతి	350	325	25
11.	జె. గొల్లపల్లె	211	84	127
12.	వంతాటిపల్లె	419	258	161
13.	సంటిగారిపల్లె	145	74	71
14.	ఎస్.రాజంపేట	167	374	207
15.	మూలపల్లె	337	271	66
16.	సిద్దవటం	375	483	108
17.	సిద్దవటం	294	355	41
18.	సిద్దవటం	310	360	50
19.	సిద్దవటం	286	355	69
20.	జంగాలపల్లె	340	311	29
21.	వెలుగుపల్లె	183	117	66
22.	శాఖరాజుపల్లె బాపణపల్లె	468	378	90
23.	నేకనాపురం	441	157	284
24.	పెద్దపల్లె	490	385	105
25.	పెద్దపల్లె	390	274	116
26.	కొత్త ఎస్.సి కాలనీ	118	94	24
27.	బొగ్గిడివారిపల్లె	391	205	186
28.	మిట్టపల్లె	341	306	35
29.	వడ్డివారిపల్లె	259	354	95
30.	పార్వతీపురం	352	447	95
31.	రామక్రిష్ణాపురం	252	535	285
32.	పార్వతీపురం	405	367	38
33.	కోదండరామనగర్	257	274	17
34.	పార్వతీపురం	206	213	7
35.	కోదండ రామనగర్	354	146	208
36.	లక్ష్మిపురం మాధవరం	273	194	79
37.	ఉప్పరపల్లె	231	310	79
38.	ఉప్పరపల్లె	216	269	53
39.	కె. మాధవరం 123వార్డులు	326	486	160
40.	కనమలోపల్లె	87	51	36

గ్రంథాలయం పక్కనే చెత్తాచెదారం

పీలేరు : స్థానిక గ్రంథాలయం సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఈ దుర్గంధం భరించలేము బాబోయ్ అంటూ స్థానకులు, గ్రంథాలయానికి వచ్చే పాఠకులు వాపోతున్నారు. గ్రంథాలయం పక్కనే చెత్తాచెదారం, కుళ్లిన వ్యర్థ పదార్థాలు కుప్పలు కుప్పలుగా ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అయితే స్థానిక పంచాయతీ అధికారులు, సిబ్బంది ఇటువైపు చూడడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

కలకడ నుంచి 8 మంది ఎంపిక

కలకడ : కలకడ ఆదర్శ పాఠశాల నుంచి జాతీయ ఉపకార వేతనాలకు 8 మంది విద్యార్థులు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లి తెలిపారు. 2023-2024 విద్యాసంవత్సరానికి ఆదర్శ పాఠశాల నుంచి 15మంది పరీక్షకు హాజరు కాగా 8 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి ప్రతి ఏడాది రూ.12వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

యోగాతో ఆరోగ్యం

అట్లూరు : మన ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే ప్రతిఒక్కరు యోగా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 28 మంది విద్యార్థులకు రామాయణం, యోగా, ధ్యానం నేర్పించడంతో పాటు పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం ప్రతి ఒక్కరూ భారతీయ సంప్రదాయ కట్టుబాట్లకు రామాయణం ఎంతో దోహదపడుతుందని, అలాగే ఆరోగ్యం పదిలంగా ఉండేందుకు చక్కటి యోగా, వ్యాయామం అవసరమని పేర్కొన్నారు. రోజూ యోగా, ధ్యానం చేయడంతో ఉత్సాహంగా ఉంటారన్నారు.